ఖైరతాబాద్
నమస్తే తెలంగాణ
బుధవారం 17 జనవరి 2024
WEDNESDAY, JANUARY 17, 2024



ప్రత్యేక పూజలు: మాజీ మంత్రి రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆయన సతీమణి వరలక్ష్మితో కలిసి సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ అరుణ శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులున్నారు. –బేగంపేట్, జనవరి 16



'స్వచ్ఛ తీర్థ': అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా దేవాలయాలు, తీర్థక్షేత్రాల పరిశుభ్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'స్వచ్ఛ తీర్థ' పిలుపు మేరకు సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆలయ శుభ్రతలో పాల్గొన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, నాయకులు నరేశ్, దయానంద్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, శ్రీధర్, రమేశ్, జయ, రవికుమార్, రఘు, మనోజ్‌లు పాల్గొన్నారు.

– బేగంపేట్, జనవరి 16

# ఆస్తిపన్ను వసూలుపై దృష్టి

- యూసుఫ్‌గూడ సర్కిల్ టార్గెట్ రూ.33.73 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.18 కోట్లు





యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం

జూబ్లీహిల్స్,జనవరి 16: నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలకపాత్ర పోషించే ఆస్తిపన్ను వసూలుపై జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించారు. వందశాతం ఆస్తిపన్ను వసూలుతో సర్కిల్ పరిధిలోని వార్డులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు ఆస్తిపన్ను వసూలును వేగవంతం చేస్తున్నారు. నాలుగైదు నెలలుగా ఎన్నికల పనులు, సంక్షేమ పథకాల అమలులో నిమగ్నమైన అధికారులు ఆస్తిపన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఈ ఏడాది రూ.33.73 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా ముందుకెళ్తున్న అధికారులు.. ఇప్పటి వరకు రూ.18 కోట్లపైనే ఆస్తి పన్ను వసూలు చేశారు.

### మార్చి 31తో ముగియనున్న గడువు

ఈ ఏడాది ఆస్తిపన్ను చెల్లింపులకు మార్చి 31 తో గడువు ముగియనుండడంతో ఆస్తి పన్ను వసూలును అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఈ ఏడాది 2023–24 ఆర్థిక సంవత్సరానికిగానూ వందశాతం ఆస్తిపన్ను వసూలుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆస్తిపన్ను వసూలుకు మరో రెండు నెలలే గడువు ఉండడంతో ఈ ఏడాది లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కమల్ పర్యవేక్షణలో యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఆస్తిపన్ను వసూలు ముమ్మరం చేశారు.

### సకాలంలో చెల్లించాలి



ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి బాటలు వేయాలి. అదనపు పెనాల్టీ భారం పడకుండా ప్రాపర్టీ ట్యాక్స్‌ను మార్చి 31 లోపు చెల్లించాలి. పన్నులు సకాలంలో చెల్లిస్తే ప్రజలపై వడ్డీ భారం తప్పుతుంది. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నాము.

– సేవా ఎస్లావత్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్



జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం నెక్లెస్ రోడ్డులోని 'స్ఫూర్తి స్థల్' వద్ద ఉన్న ఆయన సమాధిపై తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పుష్పాలు సమర్పించి, నివాళులర్పించారు. – బేగంపేట్

## గదిలో దాచిన డబ్బులు మాయం

బంజారాహిల్స్,జనవరి 16: గదిలో దాచిన డబ్బులు మాయమయ్యాయంటూ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్12లోని శ్రీరాంనగర్‌లో నివాసముండే నగరం శేఖర్(30) అనే ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల తన గదిలోని బ్యాగ్‌లో రూ.50వేలు దాచాడు. రెండ్రోజుల క్రితం దాచిన డబ్బు కోసం చూడగా కనిపించలేదు. తన గదిలోకి ఇంటి యజమాని బంధువు నిర్మల్ అనే వ్యక్తి అప్పుడప్పుడూ వస్తుంటాడని, అతడే డబ్బు కాజేసి ఉంటాడని మంగళవారం బాధితుడు శేఖర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడిపై ఐపీసీ 380 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పతంగుల దుకాణం వద్ద గొడవ

అమీర్‌పేట్, జనవరి 16 పతంగుల దుకాణం వద్ద తలెత్తిన వివాదం రెండు బస్తీల మధ్య గొడవకు దారి తీసింది. సనత్‌నగర్ పీఎస్ పరిధిలోని హరినగర్‌లోని ఓ పతంగుల దుకాణం వద్దకు వచ్చిన రామారావునగర్‌కు చెందిన యువకులు ఆదివారం సాయంత్రం పతంగులు కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో కొందరు యువకులు గుట్కా తిని అక్కడే ఉమ్మి వేయడంతో మాటామాట పెరిగి గొడవ జరిగింది. అక్కడే ఉన్న పెద్దలు జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గొడవను మనసులో పెట్టుకుని ముగ్గురు యువకులు రాత్రి సమయంలో పెద్ద సంఖ్యలో అల్లరి మూకలు పతంగుల దుకాణం వద్దకు వచ్చి గొడవకు దిగారు. దాడికి పాల్పడడంతో పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. స్థానికులు చెప్పిన వివరాలు, వీడియోలు, సీసీటీవీ కెమెరాలను పరిశీలించి నిఖిల్, అబ్బాస్, సలీమ్‌లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

## వ్యక్తిపై దాడి : కేసు నమోదు

బంజారాహిల్స్,జనవరి 16: వృద్ధుడిపై ఎందుకు దాడి చేస్తున్నావని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మాసాబ్ ట్యాంక్ సమీపంలోని నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న ఎన్.రాజు అనే కార్ డ్రైవర్ సోమవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని సర్వీ హోటల్‌వద్దకు వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడున్న ఓ వృద్ధుడిపై చేయి చేసుకుంటున్న విషయాన్ని గమనించిన రాజు వారిని అడ్డుకునేందుకు యత్నించడంతో గొడవ తలెత్తింది. మాటామాట పెరగడంతో మరికొంతమంది వ్యక్తులు అక్కడకు చేరుకుని రాజు మీద దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 341, 323,506 రెడ్‌విత్ 34 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వీల్‌చైర్ అందజేత



దవాఖానకు వీల్‌చైర్‌ను అందజేస్తున్న సోషల్ రెస్పాన్సిబిలిటీ టీమ్

ఎర్రగడ్డ, జనవరి 16: టీఎస్ ట్రాన్స్‌కోకు చెందిన 'సోషల్ రెస్పాన్సిబిలిటీ టీమ్' ఆధ్వర్యంలో ఏడాది పొడవునా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. మంగళవారం శ్రీరాంనగర్‌లోని సర్కారు దవాఖానను టీఎస్ ట్రాన్స్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బీఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, సర్వేశ్వర్ తదితరులు అక్కడి వైద్యులతో చర్చించి దవాఖానకు వచ్చే గర్భిణుల సౌకర్యం కోసం వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ డాక్టర్ ఎం.రమారాణి, సిబ్బంది విజయకుమారి, మేరీ, నవ్యరాణి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్లు గీత వృత్తిని కాపాడుకోవాలి



హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్,జనవరి16: ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న కల్లుగీత వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక హంగుల పేరుతో రియల్ ఎస్టేట్ రంగం వారు ఈత,తాటి చెట్లను నరికివేయడంవల్ల గీత కార్మికుల వృత్తి జీవనాధారం దయనీయంగా తయారైందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, కేవీఎల్, నాగభూషణం, ప్రవీణ్‌కుమార్, యాదయ్య, అంజయ్య, యాదయ్యగౌడ్, సైదులు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలి

హిమాయత్‌నగర్: గుంటూరు కారం సినిమాలో విలన్స్‌కు మార్క్స్,లెనిన్ పేర్లు పెట్టడం హేయమైన చర్య అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రలు మంగళవారం ప్రకటనలో తెలిపారు.కారల్ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేయగా,లెనిన్ మార్క్సిజంతో రష్యా దేశంలో విప్లవాన్ని తీసుకొచ్చారన్నారు. సెన్సార్ బోర్డు స్పందించి ఆ పేర్లను తొలగించాలన్నారు.

## అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు..







మణికొండ, జనవరి 16: సంక్రాంతి సంబురాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మూడు రోజుల పాటు వైభవంగా జరుపుకున్నారు. బోగి మంటలతో మొదలైన సంక్రాంతి సంబురాలు కనుమ పండుగతో ముగిశాయి. సంక్రాంతి పండుగ రోజు తెల్లవారు జాము నుంచే ఆడపడుచులు ఇంటి ముంగిట రంగవల్లులతో అలంకరించి చిన్నారులకు రేగుపండ్లు, పుష్పాల అలంకరణతో దీవెనలు అందించారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని గండిపేట గండిమైసమ్మ ఆలయం వద్ద కనుమ పండగను పురస్కరించుకొని వేలాదిగా భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పతంగులను ఎగరవేస్తూ యువత ఆనందోత్సవాల నడుమ సంబురాలు జరుపుకున్నారు. శంషాబాద్, రాజేంద్రనగర్, నార్సింగి, మణికొండ తదితర మండలాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి.



అయ్యప్ప స్వాములకు సన్మానం

శబరిమాలకు పాదయాత్రగా వెళ్లి స్వామి వారి దర్శనం చేసుకొని తిరిగొచ్చిన స్వాములకు మంగళవారం మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు మల్లేష్, బాలరాజ్, కిశోర్, నాగరాజు, శ్రీను, రాములు, సూరి, వీరబాబు, శోక్, శ్రీను, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

–మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 16



శ్రీ గణేష్‌ను కలిసి ఆహ్వానిస్తున్న ఏడో వార్డు నాయకురాలు నాగినేని సరిత

## దీపోత్సవానికి ఆహ్వానం

బొల్లారం,జనవరి 16:కంటోన్మెంట్ ఏడో వార్డు లాల్ బజార్‌లోని ఈనెల 22న జరిగే శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం దీపోత్సవంలో పాల్గొనాలని ఏడో వార్డు సీనియర్ నాయకురాలు నాగినేని సరిత మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీ గణేష్‌ని పికెట్ కార్యాలయంలో కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్, రాజేందర్ సింగ్, అమిత్, రాజేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతీర్థ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లోని మనోహర్ థియేటర్ వద్ద ఉన్న 200 ఏండ్ల పురాతన గౌరీ శంకర ఆలయాన్ని స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ నాయకులు, భక్తులందరితో కలిసి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు దయారాం, రామకృష్ణ, సురేష్ రావాల్, మాలతి, అంజన్, మురళి, వినయ్, సురేష్, తరుణ్, నరేందర్, ప్రశాంత్, రాములు, హరి, తదితరులు పాల్గొన్నారు.

– మారేడ్‌పల్లి, జనవరి 16

## బహుజనులు సంఘటితం కావాలి

హిమాయత్‌నగర్,జనవరి 16: దేశంలోని బహుజనులు సంఘటితమై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత బహుజనులకు రక్షణ, సామాజిక న్యాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.మనువాద బీజేపీ,ఆర్ఎస్ఎస్ నాయకులు మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

# సంక్రాంతి.. సరదాల పండుగ

### సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



మోండా మార్కెట్,టకారా బస్తీలో కుటుంబ సభ్యులతో కలిసి గాలి పటాలు ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, జనవరి16: సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ గాలి పటాలు ఎగుర వేసి సందడి చేశారు. టకారాబస్తీలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి గాలి పటాలను ఎగుర వేశారు.



అమీర్‌పేటలో..

సంక్రాంతి సంబురాలలో భాగంగా అమీర్‌పేట్‌లోని బీకే గూడలో డీజే హోరు నడుమ పతంగులు ఎగురవేస్తూ ఎంజాయ్ చేశారు. స్థానిక బీజేపీ నాయకులు ఆకుల మహేశ్, నర్సింగ్‌రావు, కేశవ్, ఉమ, శ్రీనివాస్, సుమన్, కుశాల్‌లు పాల్గొన్నారు.

– అమీర్‌పేట్, జనవరి 16





మణికొండలోని ఖానాపూర్‌లో.. భోగి మంటలు..





సంక్రాంతి అంటేనే పతంగులు గుర్తుకొస్తాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ముడు రోజుల పాటు కైట్, స్వీట్ ఫెస్టివల్ వేడుకలు నిర్వహించారు. దానిలో భాగంగా చిన్నా పెద్దా అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ పతంగులు ఎగిరేసి..స్వీట్లు రుచి చూసి సంబురాలు జరుపుకున్నారు.





సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గులు గుర్తుకొస్తాయి. మహిళలు ఇంటి ముందు రంగురంగులతో తీరొక్క ముగ్గులు వేస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు.



కైట్ ఫెస్టివల్ సంబురాల్లో యువతి సందడి





ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే నివాసంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, సీతాఫల్‌మండికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గరికపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నవీన్‌చారి,రవి తదితరులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

– సికింద్రాబాద్, జనవరి16



బోర్డు సీఈవోకు శుభాకాంక్షలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను మంగళవారం బోర్డు కార్యాలయంలో మారేడ్‌పల్లి సుబ్రహ్మణ్య స్వామి ఆలయం పాలక మండలి సభ్యుడు చొల్లేటి రమేష్ కలిసి శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

–మారేడ్‌పల్లి, జనవరి 16



